


# పెళ్ళి పత్రిక

## పెద్దూరి వెంకటదాసు

సాయంత్రం 6 గంటలు.

మొజంజాహి మార్కెట్ ప్రాంతమంతా ఎంతో రద్దీగా ఉంది.

అఫీసొదిలింతర్వాత తిన్నగా కరాచీ బేకరీకెళ్ళి బ్రెడ్ ప్యాకెట్ కొని సిగ్నల్ పాయింట్ దగ్గర బస్సుకోసం అరగంట నుంచి నిలుచున్నాను. అప్పటికే నాలో సహనం చచ్చిపోయింది. ఏ బస్సు చూసినా హాంగింగే. డైరెక్ట్‌గా బిహెచ్ఇఎల్ వెళ్ళే బస్సు ఎక్కడానికి మళ్ళీ ఆబిడ్స్ స్టాపు వరకు నడుచుకుంటూ వెళ్ళాలి. అక్కడికే వెళ్ళి **218** బస్సెక్కితే డైరెక్ట్‌గా బిహెచ్ఇఎల్ వెళ్లొచ్చు. మెల్లిగా బస్టాపుకేసి నడక ప్రారంభించాను.

మా పెళ్ళయి ఈ హైదరాబాద్ నేను కాపురానికొచ్చింతర్వాత కొత్తలో ఇంట్లో ఒక్కదానికి ఏమీ తోచేది కాదు. ఆయన ఎంత ససేమిరా అన్నా చివరకు ఎలాగో ఒప్పించి కాస్తా కాలక్షేపంగా ఉంటుందని మొజాంజాహి మార్కెట్లోని ఓ ఫైనాన్స్ కంపెనీలో ఉద్యోగంలో చేరాను. ఈరోజంటే తామిద్దరు. రేపు పిల్లలు పుట్టాక – వారి చదువులకని, పెళ్ళిళ్లకని, నానాతంటాలు పడేవారిని తనెంతమందిని చూడ్డంలేదు. దీపముండగానే ఇల్లు సర్దుకోవాలి. భార్యాభర్తలిద్దరూ ఉద్యోగస్తులయితేనే నాలుగు పైసలు సంపాదించి వెనకేసుకునేది. అది ఆయనకి చెప్పినా చెవికెక్కదు. అనవసరంగా సమయం వృథా చేయడం ససేమిరా నాకు నచ్చదు. ఏ పని లేకపోయినా ఏదో ఒక పుస్తకం తిరగేస్తూ వుండవలసిందే. బస్సులో కూడా ప్రయాణ బడలిక తెలియనంతగా పుస్తక పఠనంలో లీనమౌతుంది తను. వారపత్రికలు, మాసపత్రికలు, వార్తాపత్రికలు ఒకటేమిటి దేన్ని చదవకుండా వదలని తత్వం తనది. నా పఠనా శక్తికి మెచ్చుకోలుగా మావారు అంటుంటారు నీ ధాటికి తట్టుకునేది, ఆ స్టేట్ సెంట్రల్ లైబ్రరీయేనని. అలా ఆలోచిస్తూ నడుస్తున్న నాకు ఎందుకో అనుమానం కలిగి వెనక్కి తిరిగి చూశాను. రద్దీగా ఉన్న రోడ్డు కావడం మూలాన క్షణం నేనాగేసరికి నన్ను తాకీతాకనంత దగ్గరలో 'సారీ' అని ఠక్కున ఆగిపోయాడు. తలెత్తి చూశాను అతని వంక. ఇందాక సిగ్నల్ దగ్గర బస్సు కోసం వెయిట్ చేస్తున్నప్పుడు కూడా అలాగే మింగేసేలా చూస్తుంటే కాస్తా సర్దుకుని పక్కకు నిలబడింది తను. మళ్ళీ వడివడిగా నడవసాగాను బస్టాప్‌కేసి. నా ఆలోచనలు మళ్ళీ దారి మళ్ళాయి.

మా ఊళ్ళో నేను డిగ్రీ చేస్తున్న రోజుల్లో నన్నందరూ కాలేజీ బ్యూటీ అని ఆటపట్టించడం గుర్తుకొచ్చింది. అందానికి గ్రేడింగివ్వటం నామటుకు నాకు నచ్చని విషయం. మిస్ ఇండియా, మిస్ వరల్డ్, మిస్ యూనివర్స్, కోటానుకోట్లమందిలో ఎందరో అందగత్తెలు. దైవదత్తమైన అందాన్ని కొలవడానికి ప్రమాణమేది?

అందాన్ని మనసులో ఆరాధనా భావంతో చూడడంలో తప్పు లేదేమో

గానీ, పైకి పదేపదే మెచ్చుకుంటూ విపరీతమైన ప్రాచుర్యాన్ని కల్పించడం నాకు నచ్చదు. అందుకే ఆనాడు కాలేజీ బ్యూటీ అంటూ కాంప్లిమెంట్స్ ఇచ్చినా నేను మురిసిపోలేదు. పైగా నొచ్చుకున్నాను కూడా.

'నీలాంటి అందాలరాశి నాకు భార్యగా లభిస్తుందని నేనేనాడు ఊహించలేదు' అని నా భర్త అన్నప్పుడు నేను పొంగిపోలేదు సరికదా ఈ అందం శాపమేమోనని బాధపడ్డాను కూడా. నా అంత స్సౌందర్యాన్ని (మనస్సు) నా బాహ్య సౌందర్యం డామినేట్ చేసిందని అనిపించింది. అదే అన్నాను మా వారితో.

'సారీ దివ్య! ఊటీ అందంగా వుందంటే దానర్థం కాశ్మీరు అందవిహీనమనా! నీ మనస్సు నాకు తెలుసు. మెచ్చుకోలుకు చెప్పేది కాదిది. నీ హృదయ సౌందర్యాన్ని మెచ్చుకోవడానికి నా దగ్గర మాటలు లేవు. దివ్యా! మనస్ఫూర్తిగా నేనీమాట చెబుతున్నాను''

అంతే. ఆయన గుండెల్లో వాలిపోయాను. అలా ఆలోచించుకుంటూ నడుస్తున్న నేను ఒక్కసారి కర్ణభేరి బద్దలయ్యే స్థాయి కారు హారన్ మోతతో ఉలిక్కిపడ్డాను. తూలిపడ్డంత పని చేశాను. ఆ క్షణంలోనే ఒక చెయ్యి నన్ను జబ్బ పుచ్చుకుని పక్కకు లాగింది. రెప్పపాటు కాలంలో అంతా జరిగిపోయింది. ఆబిడ్స్. అందునా సినిమా థియేటర్ ముందు విపరీతమైన జనం వాహనాల బారులు రకరకాల హారన్ల మోత గోలగోలగా ఉందా ప్రాంతమంతా. ఆ షాక్ నుంచి తేరుకుని చూశాను. నన్ను లాగిన వ్యక్తి ఎవరా అని. ఇందాకటి వ్యక్తే. తను ఫుట్‌పాత్ నంటుకునే నడుస్తుంది. అంత అజాగ్రత్తగా తనేం లేదే. అయితే అతను కావాలనే తనని పక్కకి లాగాడా. ఎవరు ఎవరి గురించి పట్టించుకునే తీరిక లేకుండా ఎవరి బిజీలో వాళ్ళు వెళ్తున్నారు. నిజంగానే తను అప్రమత్తంగా లేనందువల్లే అలా జరిగి ఉండొచ్చునని సరిపెట్టుకుని ఎలాగైతేనేం స్టాపు వరకు చేరి ఓ మూలగా నిలబడ్డాను. అయినా నా మనస్సులో ఆ విషయం మెదులుతూనే ఉంది. తాకడానికే అలా చేశాడా, అయినా దానివల్ల అతనికి ఒరిగేదేమిటి? మార్కెట్ నుంచి తనతోపాటే తన వెనకాలే వచ్చాడంటే అతడు తనని ఫాలో చేస్తున్నాడా! అయినా అతడికేమవసరం? కాకతాళీయంగా అలా జరిగిందేమో. ఎంత మందికి ఎన్ని పనులుండవు. వెనకాల వచ్చినంత మాత్రాన వెంటపడ్డట్టా? వాళ్ళకింకే పనులుండవా! తనే అతిగా ఊహిస్తోందేమో! అని మనసుని ఎంత సమాధానపరుచుకున్నా కుదరటం లేదు. మళ్ళీ ఒక్కసారి అటు తిరిగి చూశాను.

నిశ్చయంగా నా వంకే చూస్తున్నాడు. నాకు మూడు నాలుగు గజాల దూరంలో నిలబడి – అసహనంగా మరోసారి నా చేతి వాచీవంక చూసుకుని అతడ్ని గమనించనట్టే బస్సు రాకకోసం నిరీక్షించసాగాను. ఒక్కసారి మార్కెట్‌వైపు దృష్టి సారించిన నాకు ప్రాణం లేచివచ్చినట్లయింది. బస్సు వస్తోంది. బస్సులోకి ఎక్కగలిగాను అతికష్టంమీద. ఒక చేత్తో బ్యాగ్, మరో చేత్తో సపోర్టింగ్ రాడ్ పట్టుకుని నిలబడ్డ నేను ఇంకాస్త పక్కకు జరిగి సీట్ సపోర్ట్ తీసుకుని సరిగ్గా నిలబడడానికి ప్రయత్నిస్తుంటే నా చేతిపై మరో బలమైన చేయి పడి నొక్కుతున్నట్టుగా అనిపించి తల తిప్పి చూసి అవాక్కయ్యాను. నా తీక్షణమైన చూపులకతను చేయి పక్కకి సర్దుకున్నాడు. సందేహం లేదు. కావాలనే నా వెంటపడుతున్నట్టు అనిపించింది నాకు. పనిగట్టుకుని కష్టపడి మరీ లోపలికంటూ రాగలిగాడంటే నిశ్చయంగా తనవెంట పడ్డాడు. లాభంలేదు – తనే సర్దుకోవాలి. ఇంకాస్త ఒత్తిగిలి నిలబడ్డాను సీటువైపు పూర్తిగా జరిగి.

'టికెట్' 'టికెట్' కండక్టరుకు దారిస్తున్న నెపంతో పూర్తిగా నాపైకి వంగాడతను. ఎటూ జరగడానికి వీల్లేకుండా చుట్టూ జనం – పూర్తిగా వెనక్కి వాలాను. బస్సు కుదుపులకు అతని బాడీ నాకు తగులుతూనే ఉంది ఎంత జరిగినా. కావాలనే నన్నుతాకడానికి ప్రయత్నిస్తున్నాడని నాకర్థమైంది. ప్రతి కుదుపుకి నన్ను ఇబ్బందిపెడుతూనే ఉన్నాడు. చూపులతో దహించివేసేలా నావైపే చూస్తున్నాడు –

నా అసహాయ స్థితిని ఆసరాగా తీసుకుని.

అతని నీచబుద్ధికి ఒళ్ళంతా కంపరం పుట్టింది. ఊపిరి కూడా అందనంత ఒత్తిడిలో నా బ్లవుజంతా తడిసి ముద్దయింది. పసుపుపచ్చని నా మేని ఛాయని పైటచాటున దాచుకోవడానికి చేతిని వదిలి పైట సవరించుకుందామన్నా వీలులేని నా నిస్సహాయతని అర్థం చేసుకోలేని అతని ప్రవర్తన జుగుప్స కలిగించింది.

బస్సాగింది. దిగేవాళ్ళని దిగని వ్వడం లేదు జనం. తోసుకుని లోపలకు ఎక్కుతూనే వున్నారు కొందరు. నో డౌట్. అతడు నన్నే ఫాలో చేస్తున్నాడు. వెంటనే నాకో ఆలోచన వచ్చింది. వెంటనే ఇక్కడ దిగిపోవాలి. ఇంకో బస్సులో వెళ్ళొచ్చు. దిగేవాళ్లతో పాటే నేను కదిలాను. ఈ తోపులాటలో అతని బారి నుంచి తప్పించుకోవాలంటే ఇదొక్కటే మార్గం. ఫుట్‌బోర్డు నుంచి నేలమీద కాలుపెడుతున్న నన్ను ప్రయత్నపూర్వకంగా నా ముందునుంచి ఫుట్‌బోర్డ్ రాడ్ పట్టుకునే నెపంతో నా చెస్ట్‌కు చేయి తగిలేట్టు చాచడం, నేనా చేతిపై కిందపడబోతూ వాలడం అనూహ్యంగా జరిగిపోయాయి. ఒక్కసారి తలెత్తి చూసిన నాకు ఆవేశం కట్టలు తెంచుకుంది. మళ్ళీ అతనే, ఒక్క ఉదుటున నా చెయ్యి గాల్లోకి లేచింది. అంతే! అతని చెంప చెళ్ళుమంది.

ఊహించని నా రియాక్షన్‌కి అతడు నిర్ఘాంతపోయాడు. మరుక్షణంలో నేను కుదుటపడేసరికే, జనం నాపక్షాన చేరి నాపై సానుభూతి కురిపిస్తూ, నేను వారించకపోతే అతనిపై దాడిచేసేవారే. అనవసర గొడవెందుకని నా మౌనాన నేను వెళ్ళిపోతే సరిపోతుందని, వాని పాపం వానికే అనుకొని మౌనంగా ఒకపక్కకు నిలబడ్డాను, ఇంకో బస్సుకోసం. దిమ్మదిరిగిపోయి చేష్టలుడిగి నిల్చున్న అతన్ని మరోసారి తేరిపార చూశాను. నీళ్ళు నిండిన కళ్ళతో ఎంతో అమాయకంగా, కృతజ్ఞతా భావంతో చూస్తున్నట్టనిపించింది నాకు. 'ఐ యామ్ సారీ, నన్ను క్షమించండి' అది చెప్పడానికే ఆగినట్లు ఆ మాట చెప్పేసి, గిరుక్కున వెనుదిరిగి మాయమయ్యాడు రెప్పపాటు కాలంలో.

''మీరంతగా అభిమానించే, కాదు మీచే అంతగా ప్రేమించబడే ఆ ఫ్రెండ్‌ని చూడాలని నాకు మాత్రం ఆరాటంగా లేదనుకున్నారా! చూడండి. మనమిచ్చే ఆతిథ్యం అతనికి జీవితకాలం గుర్తుండేలా అరేంజ్ చేస్తాను. ఇటీజ్ మై ప్రామిస్''

దాదాపు ముప్పై ఐదు సంవత్సరాలు వుండొచ్చు. పొట్టి, పొడవు కాని మామూలు ఎత్తు, అందుకు తగ్గ లావు. చూడగానే ఎదుటివారిని ఆకర్షించే రూపం. చేతిలో టిఫిన్ బ్యాగ్. ఇంగ్లీష్ న్యూస్ పేపర్. చదువుకున్న వ్యక్తిలానే కనిపించాడు. తానే తొందరపడి తప్పుగా అర్థం చేసుకుందేమో! ఎంతోసేపు వెయిట్ చేయకుండానే మెట్రోలైనర్ రానే వచ్చింది. బస్సు ఎక్కిన తర్వాత మళ్ళీ ఒకసారి వెనక్కి తిరిగి చూశాను. అతని జాడే లేదు. సీట్లోవెనక్కి వాలి రిలాక్సయ్యాను – చాలాసేపటి నుంచి నిలబడి వుండడం వల్ల. ఇంటికెళ్ళిన తర్వాత ఆ రాత్రి మావారితో చెప్పాను జరిగినదంతా, ఒక్క చెంప వాయించానని తప్ప – అనవసరంగా కంగారుపడతారని. అంతా విని అన్నారు – ''బస్సన్నతర్వాత ఒకరికొకరు తగలకుండా ఉండడం కష్టం. కాస్త లేటయినా మెట్రోలో రావలసింది. కొంతమంది పోకిరీలు అదేపనిగా ఆడవాళ్ళని వేధిస్తుంటారు బస్సుల్లో. మన జాగ్రత్తల్లో మనం వుండాలి. గొడవపడితే చినికి చినికి గాలివానయ్యే ప్రమాదమే ఎక్కువ. జనంలో చైతన్యం రావాలి. అప్పుడే ఇలాంటివి జరగవు''


మావారన్నట్టు అతను పోకిరిలా కనిపించడం లేదు తనకి.

''దివ్యా గుర్తుందిగా – రేపు ఈవినింగ్ మా ఫ్రెండ్...''

''తెలుసు మహాప్రభో– ఎన్నిసార్లు చెబుతారా విషయం. రేపు రాత్రికి అతను మనింటికి భోజనానికి వస్తున్నారు. మీరొచ్చేసరికి అన్నీ రెడీగా ఉండాలి. నాన్‌వెజ్‌లో మీరు చెప్పిన ఐటమ్స్ – ఓ.కె.''

''ఇల్లంతా నీట్‌గా'' మావారేదో చెప్పబోయేంతలో నేనే అందుకున్నాను –

''మీరంతగా అభిమానించే, కాదు మీచే అంతగా ప్రేమించబడే ఆ ఫ్రెండ్‌ని చూడాలని నాకు మాత్రం ఆరాటంగా లేదనుకున్నారా! చూడండి. మనమిచ్చే ఆతిథ్యం అతనికి జీవిత




కాలం గుర్తుండేలా అరేంజ్ చేస్తాను. ఇటీజ్ మై ప్రామిస్''

ఆప్యాయంగా నా చెక్కిలి ముద్దాడి ఆనాటికి ప్రశాంతంగా నిద్రపోయారు మావారు.

ఆ మరుసటిరోజు చేయాల్సిన పని అంతా తల్చుకుని నేను మెల్లిగా నిద్రలోకి జారుకున్నాను.

'స్నేహం నీడనిచ్చే చెట్టులాంటిది' అన్నది సూక్తి కావచ్చు. మావారి ఆ హడావిడి, వారం రోజుల నుంచి ఆయన మిత్రుని రాకకోసం చేస్తున్న అరేంజ్మెంట్స్ చూసి నాకే అసూయ కలిగింది. మా పెళ్ళయిన ఈ ఆర్నెల్లలో దాదాపు అందరూ వచ్చి కలిసి వెళ్ళినవారే. ఇంకొందరు పెళ్ళిలో కలిశారు. వారిని మావారు పరిచయం చేశారు. నాకందరూ పరిచయమే కానీ మా వారు ప్రత్యేకించి పదేపదే చెప్పే ఈ అరుదైన మిత్రుడు ఎందుకని ఇంతవరకూ రాలేదు. కనీసం పెళ్ళికి కూడా రాలేదు. ఆ విషయం అడిగింది భర్తని.

''మన పెళ్ళికి కొన్ని రోజుల ముందే అతని భార్య క్యాన్సర్‌తో చనిపోయింది. ఆ వివరాలన్నీ తీరిగా ఎప్పుడైనా చెబుతాను'' అన్నాడు.

నేను మారుమాట్లాడలేదు. కొన్నాళ్ళకి మావారే చెప్పారు - 'నా మనస్సు కుదుటపడ్డాక మొట్టమొదట మీ ఇంటికే వస్తానని మాటిచ్చాడని'. ఆ సమయం రానేవచ్చింది. అదే మావారి హడావుడికి కారణం.

ఆ క్షణం రానేవచ్చింది. మావారి బండి శబ్దం నా చెవిలో పడింది. ఆ వెనకాలే స్కూటరాగిన శబ్దం. అంటే అతను వచ్చాడన్నమాట. గేటు తీస్తున్న శబ్దం.

''రాఘవా! అంత ఆత్మీయంగా నీవు ఆహ్వానిస్తే కాదనలేకపోయాను. నా భార్య చనిపోయిన తర్వాత నీకిచ్చిన మాట ప్రకారం మీ ఇంట్లోనే అడుగుపెడుతున్నాను.''

మావారు 'నాకు ఇన్స్పిరేషన్ అతనే' అని ఏ మిత్రుని గురించి చెబుతుంటారో అతన్ని చూడాలని నా మనస్సు తొందరపడుతుంటే - 'నా భార్యని పరిచయం చేస్తానుండు' అంటూ ''దివ్యా!'' అని పిలవడం - అప్పటికే నేనక్కడ ప్రత్యక్షం.

''దివ్యా! నేను ఆఫీసు నుంచి రావడం లేటయినప్పుడల్లా నీవు చిరాగ్గా 'మళ్ళీ మీ ఫ్రెండ్ కలిశారా. ఎన్నిసార్లు చెప్పినా అదే మాట. నాకంటే మీకతనే ఎక్కువా. అస్తమానం అతని గురించే చెబుతుంటారు' అంటూ అసూయ పడుతుంటావే. ఒక్కసారి నా ముందుకొస్తే మీకేం పనిపాట లేదా! అంటూ దులిపేస్తానంటుంటావే. ఆ మిత్రుడే - భానూ, నా భార్య దివ్యవాణి.''

సోఫాలో కూర్చుని వీక్లీ తిరగేస్తున్న అతను తలెత్తి చూశాడు నా వంక - ''నమస్తే'' అన్న నా గొంతు విని. అంతే!

అప్రయత్నంగానే అతని చేయి చెంపమీదికెళ్ళింది. నన్ను చూస్తూనే చేష్టలుడిగి అలాగే ఆగిపోయాడు.

క్షణకాలం పాటు నా మతిపోయింది. గతమంతా నా కళ్ళముందు మెదిలింది. అతను బస్సులో నన్ను వెంటాడడం, నేను చెంప వాయించడం నా కళ్ళముందు కదిలింది లీలగా. ఒళ్ళు తూలుతున్నట్లనిపించి ఆసరాకోసం సోఫాపై చేయి మోపి మరోసారి చూశానతన్ని - తనేం పొరపడట్లేదు కదా! కత్తివేటుకి కూడా నెత్తురు చుక్క లేనట్లు నిర్జీవ ప్రతిమలా కూర్చున్నాడు సోఫాలో అలాగే. కొన్ని నిముషాల మౌనం - మావారు మాత్రం ఇవేవీ గమనించలేదులా ఉంది, తన ధోరణిలో తాను మాట్లాడేస్తున్నాడు ఆనందంతో.

అతను ముభావంగా ఉండడం గమనించి నేనే అన్నాను, భోజనాలు వడ్డిస్తూ - ''మావారు అంతగా ఆరాధించే మిమ్మల్ని ఎప్పుడెప్పుడు చూడాలా అని ఉన్న నా కోరిక ఇన్నాళ్ళకి నెరవేరింది'' మన మధ్య జరిగిన సంఘటన నేను మనసులో పెట్టుకోలేదు అని పరోక్షంగా ప్రస్తావిస్తూ.

'నా టేస్ట్, మా దివ్య టేస్ట్ ఒకటే. నాకేది నచ్చుతుందో తనకి అదే'

ఆ మాటలకి భానుప్రకాష్ అంతరంగంలో ఏ సాగర మథనం జరిగిందో కాని పైకి చిరునవ్వే సమాధానంగా తల పంకించాడు.

భార్యావియోగ బాధ నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న అతనికి ఇది మరో షాక్ అవుతుందేమోనని నా మనస్సు కలత చెందింది.

అతడు వెళ్లొస్తానని చెప్పి బయలుదేరి వెళ్లిన తర్వాత కూడా నా ఆలోచనలు అతనిచుట్టే పరిభ్రమించాయి. సృష్టికి ప్రతిసృష్టి చేసిన విశ్వామిత్రుడు కూడా ఆడదాని అందానికి అలుసయి పోలేదా! తప్పు చేయడం మానవ సహజం. ఆ తప్పు తెలుసుకుని సరిదిద్దుకోవడమే మానవత్వం.

భానుప్రకాష్ మాత్రం దానికతీతుడా. ఏదిఏమైనా జరిగింది ఒక పీడకలలా తలచి తాను మరచిపోయినా, నేనే రాఘవ భార్యగా తారసపడేసరికి అతనెలా రియాక్టయ్యాడో... అలా ఆలోచిస్తూ ఎప్పటికోగాని నిద్రలోకి జారుకున్నాను.

***

ఇది జరిగిన కొన్నాళ్ళకి -

''దివ్యా! మనం భానుప్రకాష్ ఇంటికి వెళ్ళాలి. తొందరగా తయారవు'' అంటూ రాగానే పురమాయించాడు రాఘవ, తన చేతిలోని వారపత్రికను నాకందిస్తూ.

''చాలాకాలం తర్వాత, ఆ మాటకొస్తే భార్య చనిపోయిన తర్వాత కలం పట్టడనుకున్న భానుప్రకాష్ చిత్రంగా మళ్ళీ రచన చేశాడు. న్యూజెర్సీ కథల పోటీలో ప్రథమ బహుమతి సంపాదించిన ఆ కథ ఈ వారపత్రికలోనే వచ్చింది. తీరిగ్గా చదువుకుందువుగాని తొందరగా తెములు. మనల్ని అర్జంటుగా రమ్మని కబురుచేశాడు. మనకోసం వెయిట్ చేస్తుంటాడు ఇంటిదగ్గర'' - ఒకపక్క మావారు చెబుతుండగానే నా కళ్ళు ఆ కథకోసం వెతికాయి.

అప్పుడు చూసింది కథ - క్యాప్షన్ - 'పెళ్ళిపత్రికో - భానుప్రకాష్.

యాక్సిడెంటల్‌గా ఏమిటి ఈ చిత్రం.

టకటకా చదవడం ప్రారంభించాను - మావారు తొందరపెడుతున్నా. మొజంజాహి మార్కెట్‌లో తను మొదటిసారి అతన్ని చూసినప్పటి నుంచి ప్రారంభించి, జరిగిందంతా పూసగుచ్చినట్టు రాశాడు. ఊపిరి బిగబట్టి పేజీలకు పేజీలు - సినిమా రీళ్ళలా నా కళ్ళముందు దృశ్యంలా కన్పిస్తుంటే - టక్కున నా దృష్టి అక్కడ ఆగింది. కళ్ళలో నీళ్లు సుళ్ళు తిరుగుతుంటే మరొక్కమారు చదివానా పేజీని. అంటే చనిపోయిన అతని భార్య పోలికలతో ఉన్నానా నేను- కథకోసం అలా వ్రాశాడా.

ఎలాగూ కాసేపట్లో వెళ్తున్నాంగా అతనింటికి అనే భావన నాలో మెదలగానే నా వెన్నులో సన్నని

వణుకు ప్రారంభమైంది. నిజంగానే అతని భార్య తనలా వుండేదా!

'ఆమెకి పెళ్ళి కాకపోతే మోడువారిన నా జీవితంలో మళ్ళీ వసంతమొచ్చినట్టే. అది కుసంస్కారమని తెలిసినా ఆమెకి వివాహమైందో లేదో తెలుసుకునే వరకు ఆమెను అనుసరించాను' అని వుంది ఒక పేజీలో.

అదే నిజమైతే, అతన్ని అపార్థం చేసుకుని తొందరపడి చెంప వాయించినందుకు నా మీద నాకే అసహ్యం వేసింది. మిగిలిన కాసిన్ని పేజీలు చదివి ఆఘమేఘాల మీద బయలుదేరాము బండిమీద భాను ఇంటికి.

'ఎక్కడండీ భానుప్రకాష్ గారుండేది' అని అడిగాను దారిలో.

'కెపిహెచ్‌బి'లో.

అంతే మళ్ళీ చెంపమీద చెళ్ళున చరిచినట్టయింది నాకు. అంటే అతను దిగాల్సిన స్టేజిలో నేను దిగి, నన్ను ఫాలో చేస్తున్నాడని అపోహపడి తనే తప్పుచేసింది.

మా బండి వారింటి ముందు ఆగగానే, భానుప్రకాష్ వాళ్ళమ్మగారు మాకోసమే ఎదురుచూస్తూ ఆప్యాయంగా ఆహ్వానించారు. భానుప్రకాష్ ముఖంలో చాలా మార్పు కనిపించింది నాకు.

"మీ ఇంటికి వచ్చినప్పుడు మా అబ్బాయికి ఏం మంత్రమేశారో గానీ అమ్మా! ఎప్పుడూ దిగాలుగా భార్య ఫోటో ముందు గంటలు గంటలు గడిపే నా కొడుకు, చాలాకాలం తర్వాత మళ్ళీ కలంపట్టి కథ రాశాడమ్మా" అంటూ పట్టలేని సంతోషంతో చెప్పుకుపోతోందా తల్లి.

తన బుర్ర మాత్రం ఏదో ఆలోచిస్తోంది. ఎంత చమత్కారంగా కథాముఖంగా నాకు అపాలజీ చెప్పాడు?!

ఆనాడు మౌనంగా తలెత్తి నా కళ్ళలోకి చూడడానికి జంకిన భానుప్రకాషేనా ఈయన.

ముఖ్యంగా 'నీవు నా కథ చదివి నన్నర్థం చేసుకున్నందుకు నాకెంతో రిలీఫ్‌గా ఉంది. నా కథకు బహుమతి వచ్చినందుకు కాదు' అని చెప్పకనే చెప్పాడు.

'నా కథకు బహుమతి రావడం కంటె మీరు రావడమే నాకు చాలా ఆనందం కలిగించే అంశం' అని రాగానే చెప్పాడు. దానర్థం తనకిప్పుడే తెలుస్తోంది. కానీ, నా సంశయాన్ని నివృత్తి చేసుకోవడానికి నా కళ్ళు మాత్రం గదంతా వెతుకుతూనే వున్నాయి. మిత్రులిద్దరూ అలా బైటికెళ్ళగానే భాను వాళ్ళమ్మని అడిగేశాను ఉండబట్టలేక – "మీ కోడలి ఫోటో ఒకసారి"

నా మాటలు పూర్తి కాకుండానే తనే అందుకుంది – "నిన్ను చూస్తూంటే సాక్షాత్తు నా కోడల్ని చూస్తున్నట్లుంది. అచ్చం నీలాగే కుందనపు బొమ్మలా వుండేది నా కోడలు" అని కళ్ళు తుడుచుకుంటూ లోపలినుంచి కోడలి ఫొటో తెచ్చిచ్చింది. నా మతి పోయింది అది చూస్తూనే. ఆమె డిటో నాలాగే. సినిమాలోలా ఉంది అంతా తనకి. ఇది సంభవమా, యథార్థం కళ్ళముందు కనిపిస్తుంటే కాదనగలమా! ఇంతలోనే మిత్రులిద్దరూ వచ్చారు. చప్పున ఫొటో పక్కన పెట్టేశాను.

"మీ భార్యాభర్తలిద్దరూ రావడం నాకెంతో ఆనందంగా ఉంది" అతను కృతజ్ఞతాపూర్వకంగా నా కళ్ళలోకి చూసి ఆ మాటలన్నప్పుడు నా మనస్సులో ఎక్కడో కలుక్కుమంది. ఆ తల్లీతనయుల ఆతిథ్యానికి, ఆప్యాయతకు తడిసి ముద్దయి 'ఇక వస్తాం' అంటూ సెలవు తీసుకుని బయలుదేరాము. తీపి జ్ఞాపకాలు మూటగట్టుకుని – బయలుదేరే ముందు ఆ తల్లి ఆవేదనతో చెప్పిన మాట నా మనస్సును పట్టి కుదిపేసింది. 'యస్ తనే ఏదో ఒకటి చెయ్యాలి' అని నిశ్చయానికి వచ్చాను, ఆనాటి రాత్రి బాగా ఆలోచించి.

***

కాలచక్రంలో మరో ఆరు నెలలు –

ఈమధ్యలో నేను పుట్టింటికెళ్ళి పురుడు పోసుకోవడం, పండంటి మగబిడ్డకు జన్మనివ్వడం నాకు సంతృప్తినిచ్చినా – అంతకంటె సంతృప్తినిచ్చే ఓ వార్త మావారు వచ్చి చెప్పినప్పుడు, అతనందించిన ఆ 'పెళ్ళిపత్రిక' చూసినప్పుడు తన్మయత్వంతో నా మనసు పులకించింది.

పాపం ఆయనకేం తెలుసు? ఈ పెళ్ళికి భానుప్రకాష్‌ని ఒప్పించింది తనేనని. చనిపోయిన భాను భార్య తన అక్కేనని, పెళ్ళికి ముందు తన తండ్రి చేసిన తప్పిదానికి ఒక యువతి బలిపశువైందని – నాన్న నోరు నొక్కి మా ఊరి మునసబు గారైన తన తాతగారు ఖర్చులన్నీ భరించి ఆమెకు వేరే యువకునితో పెళ్ళి చేసి, ఆమెను దూరంగా ఉంచాలని సిటీకి పంపారని, ఆమెకు పుట్టిన బిడ్డే – భాను భార్య అని, తను ఊరొచ్చిన తర్వాత తెలుసుకున్న నిజాలు, మావారికేం తెలుసు.

'ఓ మహా రచయితా! నీలో మళ్ళీ పెళ్ళి చేసుకోవాలనే ఆలోచనకు జీవం పోసిన నా రూపం – నీ కలానికి జీవం పోసింది. అభిమానాన్ని పంచి ఇవ్వడానికి అర్ధాంగే కానక్కరలేదు. నా బిడ్డకు నీ పేరు పెట్టుకున్నామంటే నీ మీద మాకున్న గౌరవం ఏపాటిదో మీకర్థమయ్యే వుంటుంది. నా మూలంగా మీలో పెళ్ళి ఆశ చిగురించిందన్న విషయం ప్రతిక్షణం నా మనస్సులో కదలాడుతూ పిచ్చిదాన్ని చేస్తోంది. మీ భార్య రూపంలో నేనుండడం యాదృచ్ఛికం. నాకు పెళ్ళి కాకపోతే చేసుకోవాలని మీరనుకున్నప్పుడు – నేను వివాహితను కాబట్టి – మీకా అవకాశం లేదని – జీవితాంతం మోడుగా ఉంటానంటే అది మీకు అనిపించవచ్చునేమో కాని, నాకు అది ఎంత బాధాకరమో ఆలోచించారా. మీకు మాత్రమే మనసుందా! మాది రాతి హృదయమా! దయచేసి నా బాధలోని అర్థాన్ని మీరే వెతుక్కోండి – ఓ రచయితగా. అందుకే, నాకోసం మీరు మళ్ళీ పెళ్ళి చేసుకోండి. నేనింతవరకు ఎవర్నీ ఏమీ అడగలేదు. చివరకు నా భర్తని కూడా. మొదటిసారి మిమ్మల్నే అర్థిస్తున్నాను, మీరు మళ్ళీ పెళ్ళి చేసుకుని నాకు ప్రశాంత జీవితాన్ని ప్రసాదించండని. నా ఆవేదనని అర్థం చేసుకుంటారని – స్నేహానికి 'కొత్త నిర్వచనం' చెబుతారని ఆశిస్తూ హృదయపూర్వక నమస్సులతో....

ఇట్లు

శ్రీమతి దివ్యవాణి"

నా లెటరుకు సమాధానమే ఈ 'పెళ్ళిపత్రిక'. నా ఈ కన్నీళ్ళకి అర్థం ఆయనకేం తెలుసు! పాపం.

★

